# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 221 | విశాఖపట్నం | 12-5-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 221 | VISAKHAPATNAM | 12-5-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | PhonePe





2లో

చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్

## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

అణు పరీక్షలపై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు



2లో



6లో

కాబోయే అమ్మలకు 'పోషకాలు' అందాలి


## కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌తో

# సీఎం చంద్రబాబు భేటీ..




- 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తికి సాయం కోరిన చంద్రబాబు
- పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- చెరువుల ఆధునీకరణకు రూ. 285 కోట్లు విడుదల చేయాలని వినతి

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 గోదావరి పుష్కరాల లోపు పూర్తి చేసేందుకు కేంద్రం పూర్తిస్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తయిందని, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్‌ఎఫ్) పరిధిలోని గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల తాగునీటి కష్టాలు తీర్చే పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, 'ప్రధానమంత్రి కృషి సించాయి యోజన', 'హర్ ఖేత్ కో పానీ' కార్యక్రమాల కింద రాష్ట్రంలోని చెరువులు, కుంటల మరమ్మతులు, ఆధునీకరణ పనుల కోసం రూ. 285 కోట్లు విడుదల చేయాలని చంద్రబాబు కోరారు. కాలువల పూడికతీత, గట్ల బలోపేతం వంటి పనులకు ఈ నిధులు అవసరమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.



# దర్జాగా ఇసుక దోపిడీ!

- ఇందేశమ్మ ఘాట్ వద్ద వరహా నదిలో తవ్వకాలు
- టాక్టర్లతో చుట్టుపక్కల ప్రాంతాలకు రవాణా
- మాముళ్ల మత్తులో అధికారులు?

**నర్సీపట్నం, పతాకం న్యూస్:** కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల సరిహద్దులోని ఇందేశమ్మ ఘాట్ వద్ద వరహా నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు మండలాలకు సరిహద్దులో ఉండడంతో అధికారులు ఎవరికి వారు తమ పరిధి కాదంటూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుఅదుపు లేకుండా పోయిందని, వర్షా కాలంలో వరద ప్రవాహానికి నది మధ్యలో పెద్ద మొత్తంలో ఇసుక మేటలు వేసిందని.. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం నామమాత్రంగా వుండడంతో ఇసుక అక్రమ వ్యాపారులు ఇసుక మేటల వరకు ట్రాక్టర్లు వెళ్లేలా రహదారి వేశారని స్థానికులు తెలియజేస్తున్నారు. ఇక్కడ నాణ్యమైన ఇసుక వుండడంతో ఎక్కువ ధర లభిస్తుందడంతో... రాత్రిపూట ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను ట్రాక్టర్లలోకి లోడింగ్ చేసి, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని.. మరోవైపు టైరు బండ్ల యజమానుల నదిలో ఇసుక తవ్వి, తీరానికి చేర్చి కుప్పలుగా పోస్తున్నారన్నారు. దళారులు వీరి నుంచి ఇసుక కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలించి అమ్ముకుంటున్నారని.. మరి కొంతమంది టైరు బండ్ల యజమానులు చుట్టుపక్కల గ్రామాలకు ఇసుక సరఫరా చేస్తున్నారని.. బండితో ఇసుక రూ.వెయ్యికి విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## లక్ష సీసీటీవీ కెమెరాల టార్గెట్.. 70 శాతం సక్సెస్: అనిత



**కృష్ణా, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉంగుటూరు మండలం ఆత్కూరులో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ... ఏపీలో గన్నవరం నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. కోటి నలభై లక్షల రూపాయలతో ఆత్కూర్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఇంతకు ముందు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే పెచ్చులు ఊడి మీద పడే పరిస్థితి ఉండేదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళుతున్నారని చెప్పారు. లక్ష సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ టార్గెట్ పెట్టుకొని 70 శాతం సక్సెస్ అయ్యామన్నారు. ఏదైనా నేరం జరిగిందంటే 24 గంటల్లోనే పోలీసులు కేసును (తరువాయి 2వ పేజీలో)

## మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, పతాకం న్యూస్:** ఈనెల 13న ప్రారంభమయ్యే పార్టీ మహానాడుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం జరగనున్న కిసాన్ సేజ్ ప్రాంతాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పరిశీలించారు. సభాప్రాంగణం, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేశారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడులో కీలక తీర్మానాలు చేస్తారని మంత్రి నారాయణ తెలిపారు. 'మహానాడు సుపరిపాలనకు దోహదపడే విధంగా నిర్వహించాలి. తొలి రెండు రోజులు పార్టీ డెలిగేట్స్‌తో, మూడో రోజు బహిరంగ సభగా జరగనుంది. బహిరంగ సభకు 7 లక్షల మందికి పైగా ప్రజలు రాబోతారని అంచనా. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. కమిటీల ప్రతినిధుల సమావేశంలో బాధ్యతలపై దిశా నిర్దేశం చేస్తాం. మహానాడును చరిత్రలో నిలిచేలా నిర్వహిస్తాం' అని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ (తరువాయి 2వ పేజీలో)



2లో

ఉపాధి కూలీలకు వసతులు ఏవి?

భీమసింగి వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం..

4లో




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# చిన్నారులపై 'నేర' నీడ!

భారతదేశం అమృత కాలంలోకి అడుగుపెడుతున్నదని ఊదరగొడుతున్న వేళ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్.సి.ఆర్.బి) విడుదల చేసిన తాజా గణాంకాలు దేశ సామాజిక ఆరోగ్యానికి సంబంధించిన చేదు నిజాలను మన ముందుంచాయి. ముఖ్యంగా, రక్షణ కోరే చేతులే నేరాల బారిన పడటం, భావి పౌరులే చట్టాలను చేతుల్లోకి తీసుకోవడం వంటి దుష్పరిణామాలు నాగరిక సమాజానికి గొడ్డలిపెట్టు. 2024 నివేదిక ప్రకారం, దేశంలో పిల్లలపై జరుగుతున్న నేరాలు 5.9 శాతానికి పెరగడం ఆందోళనకరం. 2022లో 1.62 లక్షలుగా ఉన్న కేసులు, 2024 నాటికి 1,87,702కి చేరాయి. అంటే ప్రతి ఏటా ఈ గ్రాఫ్ ఎగబాకుతూనే ఉంది. 'ఒక దేశపు ఆత్మను తెలుసుకోవాలంటే, ఆ దేశం తన పిల్లలను ఎలా చూసుకుంటుందో చూడాలి- అని ఓ సందర్భంలో నెల్సన్ మండేలా అంటారు. ఈ కొలమానంతో చూస్తే, మన సామాజిక వ్యవస్థ గాడి తప్పిందని చెప్పక తప్పదు. మరోవైపు, మొత్తం నేరాలు 6 శాతం తగ్గాయని సంబరపడే లోపే, మైనర్లు చేసే నేరాలు 11.2 శాతం పెరగడం నివ్వెరపరుస్తోంది. 34,878 మంది చిన్నారులు నేర ప్రవృత్తి వైపు మళ్లడం అంటే, అది కేవలం ఆ పిల్లల వైఫల్యం కాదు, మన విద్యా వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, సామాజిక వ్యవస్థల సమిష్టి వైఫల్యం అని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ఈ కేసుల సంఖ్యను కేవలం నేరాల పెరుగుదలగానే చూడలేం. ఇందులో వ్యవస్థాగతమైన మార్పులు కూడా దాగి ఉన్నాయి. ఇటీవల కాలంలో పిల్లల దుర్బలత్వాన్ని ప్రభావితం చేసే కారకాలు అనేక రెట్లు పెరిగాయన్నది వాస్తవం. వాటిలో ప్రధానమైనది ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం కావడం, పెద్దల మార్గదర్శకత్వం కొరవడటం, పట్టణీకరణ పెరగడం వల్ల వచ్చే స్థాన చలనం, సోషల్ మీడియాకు బానిసలవడం, ఒంటరితనం, పెరిగిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక బలహీనత వంటివి అనేకం పిల్లలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. నేటి ఏ.ఐ యుగంలో పిల్లల ఆన్‌లైన్ భద్రత అనేది జాతీయ ప్రాధాన్యతగా మారాలని నిపుణులు సూచిస్తున్నారు. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (పోక్సో) కింద 2024లో మొత్తం 69,191 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో బాధితుల్లో అత్యధికులు బాలికలే కావడం, 96% పైగా కేసులలో, నేరస్థుడు ఆ పిల్లలకు తెలిసినవారే కావడం అత్యంత విషాదం. ఎక్కువమంది పిల్లలు దారుణమైన నేరాలకు బలి అవుతుండగా, మరికొందరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. సోషల్ మీడియాలో నియంత్రణ లేని కంటెంట్, పిల్లల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తోంది. 'మానవత్వం లేని విజ్ఞానం ప్రమాదకరం- అన్న గాంధీజీ మాటలు నేటి ఇంటర్నెట్ యుగానికి సరిగ్గా అతికినట్లు సరిపోతాయి. ముఖ్యంగా పట్టణాల్లో పెరిగే పిల్లలకు ఎక్కువమందికి ఆట స్థలాలు లేక, తోటివారితో స్నేహ సంబంధాలు తగ్గి, డిజిటల్ స్క్రీన్ లకే అతుక్కుపోతున్నారు. ఇది పిల్లల్లో సామాజిక స్పృహను తగ్గించి, నేర ప్రవృత్తి వైపు నడిపిస్తోంది. ఈ నేరస్థ సమాజాన్ని కేవలం చట్టాలు, జైళ్లు మార్చలేవు. అరిస్టాటిల్ చెప్పినట్లు... 'మెదడుకు చదువు చెప్పి, మనసుకు సంస్కారం నేర్పకపోతే అది చదువే కాదు.- పాఠశాలల్లో విద్యాబోధన ర్యాంకుల వేట కాకుండా, నైతిక విలువల బోధన జరగాలి. నేరాల బాట పట్టే వారిలో అధిక శాతం మంది చదువుకు దూరమైన వారే. కనుక, బడి మానేస్తున్న పిల్లల విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉండాలి. స్వామి వివేకానంద కోరుకున్న 'శీలం కలిగిన యువత- కావాలంటే, అది తల్లిదండ్రుల బాధ్యతతో, ఇంటి నుంచే మొదలవ్వాలి. ఇంటి వద్ద పర్యవేక్షణ, బడిలో సంస్కారం, సమాజంలో రక్షణ... ఈ మూడూ కలిసినప్పుడే పిల్లలపై నేరాలను అరికట్టగలం, పిల్లలు నేరాలకు పాల్పడకుండా నిరోధించగలం. అప్పుడే బాల్యాన్ని సురక్షితంగా ఉంచగలం. ఎన్.సి.ఆర్.బి హెచ్చరికను సీరియస్ గా తీసుకోవాలి. 'పోయిన బాల్యపు చెరిగిన పదముల/ చిహ్నాల కోసం- అని శ్రీశ్రీ అన్నట్లు-ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా తమ పిల్లల రక్షణకు నడుం బిగించాలి. అప్పుడే మనం ఒక ఆరోగ్యకరమైన, నేర రహితమైన సమాజాన్ని నిర్మించగలం.

## ఉపాధి కూలీలకు వసతులు ఏవి?



**విజయనగరం, పతాకం న్యూస్:** భగభగ మండే ఎండల్లో శ్రమించే ఉపాధి కూలీలకు కాస్తంత భరోసా కూడా దక్కడం లేదు. తాగునీరిచ్చే నాథుడు లేడు. నీడ ఎలాగూ లేదు. వడదెబ్బ తగిలితే తక్షణం కాపాడేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేవు. దయనీయ పరిస్థితిలో పనులు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 5-30 నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. మండువేసవిలో ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. ఎండ వేడికి ఉపాధి కూలీలు చెమటలు కక్కుతున్నారు. కాసేపు సేద తీరుదామన్నా నీడ లేదు. సమీపంలో చెట్లు ఉంటే కొంత పరవాలేదు. లేకుంటే అంతే. ఎక్కడా వారు పనిచేసే చోట టెంట్‌లు గాని, మెడికల్ కిట్‌లు గాని అందుబాటులో లేవు. దీంతో కూలీలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇంటివద్ద నుంచి ప్లాస్టిక్ బాటిల్స్‌తో తీసుకువెళ్లిన నీరు ఎండ తీవ్రతకు వేడెక్కిపోవడంతో తాగలేని పరిస్థితి ఉందని కూలీలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఉండే హెల్తువెల్నస్ కేంద్రాల్లో మెడికల్ కిట్‌లు ఉన్నా కూలీలకు అందుబాటులో ఉంచడం లేదు. ఓఆర్ఎస్, ఐయోడిన్, పారాసెట్మాల్ మాత్రలు, దూది వంటివి సంబంధిత సబ్ సెంటర్ నుంచి తీసుకువెళ్లాలి. ఆ విధంగా క్షేత్రసహాయకులు చేయడంలేదు. పనులు చేపట్టిన చోట మౌలిక వసతులు లేవని గతనెలలో జరిగిన సోషల్ ఆడిట్‌లో అనేక గ్రామాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయాన్ని ఎస్సార్పీలే అధికారులకు వివరించారు. ఆ సమయంలో ఏపీడీ క్షేత్రసహాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా మార్పు లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో 1546 చోట్ల పనులకు సంబంధించి 1, 84,970మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పథకంలో వేసవి కాలంలో పనిచేసే కూలీలకు గతంలో వేసవి అలవెన్స్‌లు ఉండేవి. మొత్తం కూలీకి వచ్చే వేతనంలో ఫిబ్రవరి నెలలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్ నెలలో 30శాతం అదనంగా అలవెన్స్‌లు ఇచ్చేవారు. అవాస ప్రాంతాలకు ఐదు కిలోమీటర్లు అవతల పనులు చేస్తుంటే కూలి మొత్తానికి 10శాతం ప్రయాణ అలవెన్స్‌లు ఇచ్చేవారు. ప్రస్తుతం అలవెన్స్‌లు లేకపోగా పనిచేసే దినాలకు బిల్లులు సక్రమంగా మంజూరు కావడంలేదు. ఇటీవల మూడునెలల బిల్లులు వచ్చినట్లు కూలీలు చెబుతున్నారు. గతంలో పనిచేసిన చోట ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచేవారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కూలీలకు వడదెబ్బ తగిలినా.... గునపాం, పార కళ్లకు తగిలి గాయాలైనా ప్రథమ చికిత్స అందించే పరిస్థితి లేదు. పని ప్రాంతాల్లో విష పురుగులు కరిస్తే అంతే సంగతులు.

## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ఆయన నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను స్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో స్టాలిన్ కుమారుడు, మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎంల మద్దతుతోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో తమ మిత్రపక్షాలకు స్టాలిన్ పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు పరోక్షంగా సహకరించిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయ్ ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. సీఎం బాధ్యతలు చేపట్టాక విజయ్, స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీ తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

## బంగారం కొనొద్దన్న మోడీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఘాటు స్పందన

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి 'వైఫల్యానికి నిదర్శనం' అని ఆయన అభివర్ణించారు. సోమవారం ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ.. "నిన్న మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు.. వైఫల్యానికి



రుజువులు" అని పేర్కొన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక 'కాంప్రమైజ్డ్ ప్రధాని' దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదు" అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. అలాగే, వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని) విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానైనా విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

### అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



**గుజరాత్, పతాకం న్యూస్:** భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోక్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోక్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు. సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

## పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం: సీఎం చంద్రబాబు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ూా జవీ జష్ట్రుఅనతీఖుఎబ చీఖఱఎబ) వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## లక్ష సీసీటీవీ కెమెరాల టార్గెట్.. 70 శాతం సక్సెస్: అనిత

ఛేదిస్తున్నారని హోం మంత్రి అనిత తెలిపారు. ఆత్కూరు గ్రామంలో సీసీ రోడ్లను మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు పాల్గొన్నారు. అలాగే ఆత్కూర్ పోలీస్ స్టేషన్‌ను మంత్రులు, ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. స్టేషన్‌లో హోంమంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది: రేవంత్‌రెడ్డి

ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని వ్యాఖ్యానించారు. ఈరోజు (సోమవారం) సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ముస్లింలు, క్రిస్టియన్లు, ఇతర మతాలు, కులాలు, మావోయిస్టులు దేశ ప్రజలు కారా.. అందరికీ సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఖతం చేయడమే వాళ్ల విధానమని మండిపడ్డారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఒప్పించి జనజీవనంలో కలపడం తమ విధానమని ఉద్ఘాటించారు.

# విశాఖ రైల్వే జోన్ ప్రజల హక్కు.. ఎవరి దయాదాక్షిణ్యం కాదు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ రైల్వే జోన్ ప్రజల హక్కు అని, ఎవరి దయాదాక్షిణ్యం కాదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు తెలిపారు. 2014 రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రైల్వే జోన్‌ను రాష్ట్రంలోని అతి ముఖ్యమైన కూడలిగా ఉన్న విశాఖలో ఇవ్వాలని ఉందని, ఆ మేరకు 12 ఏళ్ల తర్వాత కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. విశాఖలోని సిఐటియు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వామపక్షాల, ప్రతిపక్షాల పోరాటం ద్వారానే రైల్వే జోన్ సాధించుకున్నామని చెప్పారు. తీవ్ర కాలయాపన తర్వాత జోన్ ప్రకటించడంపై టిడిపి సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. కేంద్ర ప్రభుత్వం సౌత్‌కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రకటించినా, జోన్‌లోని గుండెకాయలాంటి కోరాపుట్‌ను తొలగించడంలో ఆంధ్ర రాష్ట్రంపై కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరి వెల్లడైందన్నారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో కొత్త ఉద్యోగాలు ఎన్ని వస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం డివిజన్‌లో మొత్తం ఖాళీగా ఉన్న 4,698 పోస్టులు, అందులోని సేఫ్టీ కేటగిరీలోని 2,413 రన్నింగ్ స్టాఫ్ పోస్టులు ఎప్పుడు నింపుతారో చెప్పాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సౌత్‌కోస్ట్‌లో కలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల స్వయంగా కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీనివల్ల రాయలసీమలోని కొన్ని ప్రాంతాలు సౌత్ సెంటర్ జోన్‌లోనూ, గూడూరు నుండి తడ వరకూ ఉన్న రైల్వే లైన్ సదరన్ రైల్వేలోనూ ఉండిపోతాయని తెలిపారు. కొత్తవలస -- కిరండోల్ లైన్ (కెకె లైన్) అత్యధిక లాభాన్ని గడిస్తుందని, దాన్ని ఒడిశాకు తరలించడం వల్ల ఎపికి నష్టం జరుగుతుందన్నారు. కెకె లైన్‌లో 471 కిలోమీటర్లు ఉండగా, విశాఖపట్నం డివిజన్‌లో కేవలం 27 కిలోమీటర్లు మాత్రమే ఉంచారని, దీంతో, మిగిలిన 444 కిలోమీటర్లు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఈస్ట్‌కోస్ట్ జోన్‌లోకి వెళ్తుందని అన్నారు. పేరుకు సౌత్‌కోస్ట్ జోన్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినా లాభాలు ఒడిశాకు వెళ్తాయని చెప్పారు. 2024-25 జనవరి వరకు గూడ్స్ ట్రాఫిక్ వల్ల రూ.7,294 కోట్లు ఆదాయం వచ్చిందని, అందులో 93 శాతం ఒడిశాకు చెందిన ఈస్ట్‌కోస్ట్‌కు వెళ్తుందని ఉదహరించారు. రాష్ట్రంలోని అతి ముఖ్య పర్యాటక కేంద్రమైన అరకును సౌత్ కోస్ట్ జోన్ లో కలపకుండా ఈస్ట్ కోస్ట్ జోన్ లో కలపడం కేంద్ర బిజెపి వైఖరికి నిదర్శనమని తెలిపారు.

# పెరిగిన కూరగాయాల ధరలు.. రైతుల్లో ఆనందం



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** చాలా వారాల తరువాత కూరగాయలకు ఆశించిన ధరలు లభిస్తుండడంతో రైతులు ఆనందం చెందుతున్నారు. వేసవి కారణంగా కూరగాయల సాగు తక్కువగా వుండడం, మరోవైపు వివాహాది శుభకార్యాలు ఉండడంతో కూరగాయలకు గిరాకీ ఏర్పడింది. దేవరాపల్లిలోని కూరగాయల మార్కెట్‌కు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు పలు రకాల కూరగాయలు తీసుకువచ్చి విక్రయించారు. పాడేరు, అనకాపల్లి, విశాఖపట్నంలో రిటైల్‌గా కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు అధిక సంఖ్యలో వచ్చారు. బీర, బెండ, వంకాయలను వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. సుమారు 12 కిలోల బరువు వున్న క్రేటు నల్లవంకాయలు రూ.600 పలికింది. ప్రస్తుతం వివాహాలు వుండడం, మెనూలో వంకా కూర తప్పనిసరిగా కావడంతో వ్యాపారులు ఎగబడి కొనుగోలు చేశారు. గత వారం ఇదే క్రేటు వంకాయలు రూ.300కు మించి వ్యాపారులు కొనుగోలు చేయలేదు. తెల్లవంకాయ క్రేటు (15 కిలోలు) రూ.400, బీరకాయలు క్రేటు (సుమారు 14 కిలోలు) రూ.800 పలికింది. బీరకాయలు గత వారంతో పోలిస్తే రూ.300 పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక బెండ కాయలు పది కిలోలు రూ.300 నుంచి రూ.400కు వ్యాపారులు కొనుగోలు చేశారు. గత వారం రూ.200-250 మాత్రమే ధర పలికింది. గోంగూర, తోటకూర, కొత్తిమిర కూడా ఎక్కువ ధరకు త్వరగా అమ్ముడుపోయింది.

# చంద్రబాబు సమర్థతతో పరిశ్రమలు: తాతయ్యబాబు



**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘ పాలన అనుభవం, సమర్థతతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు చెప్పారు. మండలంలోని వడ్డాదిలో ఆదివారం చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె రామ్మూర్తిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కూటమిలోని మూడు పార్టీలు సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జనసేన ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ, జిల్లా రవాణా వ్యవస్థలో ఎంతో కీలకమైన బీఎన్ రోడ్డు నిర్మాణ పనులు మరో నాలుగు నెలలో పూర్తవుతాయని చెప్పారు. ఇటీవల నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి మూడుచోట్ల విజయం సాధించడం గొప్ప విషయమని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆటవిక పాలనకు ప్రజలు చరమగీతం పాడి, బీజేపీని గెలిపించడం సంతోషం కలిగిస్తున్నదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుతో బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు ఆగిపోతాయని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్ర నేత ఈర్లె రామ్మూర్తి మాట్లాడుతూ, చోడవరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి నేతలు సమన్వయంతో పని చేస్తున్నారని అన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా...




**ఎలమంచిలి, పతాకం న్యూస్:** ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఎలమంచిలి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఆడారి ప్రణతి 593 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇంకా కె.కోటపాడు మండలం చౌడువాడకు చెందిన తనకల ఉష 592, ఎస్.రాయవరం మండలం పెదగుమ్మలూరుకు చెందిన కనిగిరి హరిణి, అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం స్కూల్ విద్యార్థి ప్రకృతి తారకేశ్ 591 మార్కులు సాధించారు. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారిలో 247 మంది విద్యార్థులకు 8570కిపైబడి మార్కులు వచ్చాయి. 2,962 మంది 500పైబడి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వం పాఠశాలల్లో చదివి, 588పైబడి మార్కులు సాధించిన 12 మంది విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలను తయారు చేయించి, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయించారు. వీరిలో ఇద్దరు మినహా మిగిలిన వారంతా బాలికలు వుండడం విశేషం. కాగా ఎలమంచిలిలోని బాలికల ఉన్నత పాఠశాలలో (హైస్కూల్ ప్లస్) ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన బాలికలందరూ ఉత్తీర్ణులయ్యారు. దీనికి సంబంధించి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినుల ఫొటోలతో ఫ్లెక్సీని మెయిన్ రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటు చేశారు. వీటిని ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

# స్క్రాప్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం.. సుమారు రూ.2 కోట్లు నష్టం

**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక ఆటోనగర్‌లోని 'ఎఫ్' బ్లాకులో గల శ్రీరాధేకృష్ణట్రేడర్స్, జైవాయి మాతా ట్రేడర్స్‌కు చెందిన స్క్రాప్ గోడౌన్‌లో తెల్లవారుజామున నాలుగు గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ సామగ్రి, ఇతర వ్యర్థాలన్నింటికీ మంటలు అంటుకోవడంతో దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందిపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించి వాచ్‌మన్ తమ యజమానులైన సన్నీ లిఖమానియా, నిఖిల్ నిఖమానియాలకు ఫోన్ చేశారు. వారు తొలుత ఆటోనగర్‌లో గల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఆటోనగర్ అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పేందుకు యత్నించినా ప్రయోజనం లేకపోవడంతో పెదగంట్యాడ, మర్రిపాలెం, విశాఖపట్నం, బీహెచ్‌పీవీ, స్టీలుప్లాంటు ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలను రప్పించారు.

# ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో నిర్మాణం పూర్తయిన రైతు బజారు




**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి వాసులు, చుట్టు పక్కల గ్రామాల్లో కూరగాయలు పండించే రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుబజారు ఎట్టకేలకు సిద్ధమైంది. ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఈ రైతుబజారులో మొత్తం వంద షాపులు వున్నాయి. పనులన్నీ పూర్తికావడంతో వారం రోజుల్లో ప్రారంభించే అవకాశం వుందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయంలో అనకాపల్లికి రైతుబజారు మంజూరు చేసినప్పటికీ దానిని ఏర్పాటు చేయడంలో అప్పటి పాలకులు శ్రద్ధ చూలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆర్డీవో షేక్ ఆయిషాలు రైతుబజారు ఏర్పాటు కోసం ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న బ్లాకులను పరిశీలించారు. నాగదుర్గమ్మ ఆలయానికి ఎదురుగా చాలా కాలం నుంచి నిరుపయోగంగా ఉన్న 17, 18 బ్లాకుల్లో రైతుబజారు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన రూ.14.5 లక్షలతో గత ఏడాది డిసెంబరులో అభివృద్ధి పనులు చేపట్టారు. నిధులు చాలకపోవడంతో విద్యుద్దీకరణ, ఇతర పనులు చేపట్టలేదు. ప్రభుత్వం మళ్లీ నిధులు మంజూరు చేయడంతో విద్యుత్ వైరింగ్, ఆర్వో ప్లాంట్‌కు రూ.9.5 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12.5 లక్షలు ఖర్చు చేసి, వారం రోజుల క్రితం పనులు పూర్తిచేశారు. మొత్తం వంద షాపులను సిద్ధం చేశారు. వీటిలో 25 షాపులను డ్వాక్రా సంఘాలకు, మూడింటిని దివ్యాంగులకు, మిగిలిన 72 షాపులను రైతులకు కేటాయించనున్నారు.

# అనుమతుల్లేని కళాశాలల్లో పిల్లలను చేర్పొద్దు




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అనుమతులు లేని కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు చేపడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి (డీఐఈవో) మద్దిలి వినోద్‌బాబు ఒక ప్రకటనలో హెచ్చరించారు. డిఫెన్స్ అకాడమీ, ఐఐటీ అకాడమీ, నీట్ అకాడమీ పేర్లతో కొంతమంది విద్యా సంస్థలు నిర్వహిస్తూ ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు చేపడుతున్నట్టు తెలిసిందని, ఇటువంటి వాటిల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చే ర్పించవద్దని ఆయన సూచించారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు మంజూరు చేసిన కళాశాల కోడ్ '06'తో ప్రారంభమవుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించే ముందు సంబంధిత కళాశాలకు అనుమతి వుందా? లేదా? అన్నది నిర్ధారించుకోవాలని చెప్పారు.

# కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వన్‌టౌన్‌లోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేసింది. ఎంపీ ఎం.శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌ల సమక్షంలో ఆలయ ఈఓ శోభారాణి ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షునిగా కందుల నాగరాజు (మాజీ కార్పొరేటర్), సభ్యులుగా జి.ఎల్లయ్య, టి.వేణికుమారి, కె.స్వరూపారాణి, ఎస్.రామారావు, ఎన్.అప్పారావు, డి.శ్రీకాంత్, ఎం.నాగసుధ, సీహెచ్.మంజుల, కె.కళావతి, కె.అనురాధ, టి.నాగమణి, ఎక్స్‌అఫీషియో సభ్యునిగా ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసశర్మ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పాలక మండలి సభ్యులంతా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఏఈవో రాజేంద్రకుమార్ సమక్షంలో కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

# ఐటీకి మౌలిక వసతులు.. కాపులుప్పాడ, రుషికొండ, మధురవాడ ప్రాంతాల్లో రహదారుల విస్తరణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో ఐటీ సంస్థలకు అవసరమైన మౌలిక వసతులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఐటీ సంస్థలకు ఇబ్బడిముబ్బడిగా భూములు కేటాయిస్తున్న ప్రభుత్వం...వాటి నిర్మాణాలు పూర్తయితే ఆయా మార్గాల్లో ఉద్యోగుల రాకపోకలు పెరుగుతాయని, అందుకు తగ్గట్టుగా ముందుగానే ఆ ప్రాంతాల్లో రహదారులు విస్తరించాలని వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీలను ఆదేశించింది. కాపులుప్పాడ, రుషికొండ, మధురవాడ ప్రాంతాల్లో ఇప్పటికే 30కి పైగా ఐటీ సంస్థలు నడుస్తుండగా, పది వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా ఎక్కువగా మధురవాడ, రుషికొండ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. తాజాగా కాపులుప్పాడ ఐటీ లేఅవుట్‌లో రుషికొండ హిల్ నంబరు 3పై పెద్ద సంస్థలకు భూములు కేటాయించారు. అధికారుల లెక్కల ప్రకారం కొత్తగా 63 కంపెనీలు రానున్నాయి. ఇప్పుడున్న ఉద్యోగులు, కొత్త కంపెనీల్లో లభించే ఉద్యోగాలతో కలిపి మొత్తం 1.2 లక్షల మంది ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారని అంచనా. ప్రస్తుతం ఇన్ఫోసిస్, కాండ్యుయెంట్, సింబయోసిస్, మహతి టెక్నాలజీస్, సాఫ్ట్ సోల్, కలర్ చిప్స్, క్లోవ్ టెక్నాలజీస్, సాంఖ్య టెక్నాలజీస్, సైయెంట్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీలకు పది వేల ముంది వస్తున్నారు. త్వరలో టీసీఎస్, రహేజా సంస్థలు చెరో పది వేల మందికి హిల్ 3పైనే ఉపాధి కల్పించనున్నాయి. ఇటు చూసుకుంటే కాగ్నిజెంట్ 25 వేల మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. అదే విధంగా ఫ్లూయెంగ్ గ్రిడ్, మదర్‌సన్, సిఫీ తదితర సంస్థలు పనుల ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. కాపులుప్పాడలో ఐటీ లేఅవుట్‌లో కూడా శరవేగంగా పనులు చేపట్టాలని ఏపీఐఐసీ సూచించింది. ఆయా సంస్థలన్నీ హామీ ఇచ్చిన ఉద్యోగ అవకాశాలు 2028 నాటికి కల్పించాలి. ఈలోగా ఆయా మార్గాలను విస్తరించాల్సి ఉంది. ఇందులో భాగంగా బోయపాలెం నుంచి కాపులుప్పాడ రహదారిని వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తోంది. అదేవిధంగా నేరెళ్లవలస నుంచి కొత్తవలస మార్గాన్ని కూడా వీఎంఆర్‌డీఏనే విస్తరిస్తోంది. ముఖ్యంగా ఐటీ పార్కులకు ఇటు జాతీయ రహదారితో, అటు భీమిలి బీచ్‌రోడ్డుతో అనుసంధానమైన ఉన్న రహదారులను విస్తరించనున్నారు. మరోవైపు భోగాపురం విమానాశ్రయం వైపు కూడా ఐటీ లేఅవుట్లు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని కూడా దృష్టిలో ఉంచుకొని కనెక్టివిటీ రహదారులను అభివృద్ధి చేయాలని అదనపు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# అధికారులు, క్లాప్ వాహనాల డ్రైవర్లతో జీవీఎంసీ కమిషనర్ సమావేశాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** స్వచ్ఛ సర్వేక్షణ్-2026కు జీవీఎంసీ సమాయత్తం అవుతోంది. కమిషనర్ కేతన్‌గార్గ్ రెండు రోజుల క్రితం ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి పారిశుధ్యం మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రోడ్లపై చెత్త కనిపించకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. తాజాగా క్లాప్ వాహనాల పనితీరుపై కూడా కమిషనర్ దృష్టిసారించారు. క్లాప్ వాహనాల డ్రైవర్లు, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. క్లాప్ వాహనాలు తమ పరిధిలో మొక్కుబడిగా తిరిగి వచ్చేస్తున్నాయని, చెత్త ఇవ్వని ఇళ్లకు సిబ్బంది వెళ్లి అడగడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై వాహనాలు విధిగా తమకు కేటాయించిన ప్రాంతంలో ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను వాహనం వద్దకు తెచ్చి ఇచ్చేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలా చేయడం ద్వారా ప్రజలు చెత్తను రోడ్లపైన, గెడ్డల్లోనూ వేయకుండా నిలువరించడానికి అవకాశం ఉంటుందని క్లాప్ వాహనాల సిబ్బందికి వివరించారు. పారిశుధ్య నిర్వహణ మెరుగుపడితే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో నగరానికి మంచి ర్యాంకు వచ్చేందుకు అవకాశం కలుగుతుందని, అందుకు అందరూ తమ వంతు బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కోరారు.

## నష్టపరిహారం చెల్లించేదెప్పుడో?




**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస నుంచి విజయనగరం వరకు నూతనంగా నిర్మిస్తున్న నాలుగో రైల్వే లైన్‌కు సంబంధించి బాధితులకు చెల్లించే నష్టపరిహారం విషయంలో రైల్వే శాఖ స్పష్టత ఇవ్వడం లేదు. మరోపక్క నాలుగో రైల్వే లైన్ పనులను శరవేగంగా చేస్తోంది. దీంతో ఏరాత్రివ్వుడో రైల్వే అధికారులు వచ్చి తమ ఇళ్లు, దుకాణాలను ఖాళీ చేయిస్తారోనని నిర్వాసితులు భయాందోళన చెందుతున్నారు. మూడో లైన్‌కు సంబంధించి కూడా బాధితులకు ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదు. అదే పరిస్థితి తమకూ ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు మాత్రం ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెబుతున్నారు. అయితే, ఎప్పుడో పూర్తయిన మూడో రైల్వే లైన్ బాధితులకు ఇప్పుడు న్యాయం చేస్తామని చెబితే ఎలా నమ్ముతామని బాధితులు ప్రశ్నిస్తున్నారు. 2011 సంవత్సరంలో కొత్తవలస నుంచి విజయనగరం వరకు మూడో రైల్వే లైన్ కోసం అధికారులు ప్రతిపాదనలు చేశారు. తరువాత నోటిఫికేషన్ జారీ చేశారు. రైల్వే లైన్ ఏర్పాటు మాత్రం 2017లో జరిగింది. కొత్తవలస అర్‌యూబీ నుంచి కొత్తవలస రైల్వే స్టేషన్ వరకు భూసేకరణ చేశారు. అయితే, 39 సెంట్లు స్థలం మాత్రమే సేకరించామని చెప్పి సంబంధిత బాధితులకు పరిహారం చెల్లించారు. కానీ, ఎంతమందికి ఎంత నష్ట పరిహారం చెల్లించారో లెక్కలు లేవు. 11 కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదు. జిల్లా పరిషత్‌కు చెందిన స్థలాలతో పాటు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారి స్థలాలను రైల్వే శాఖ స్వాధీనం చేసుకుని అవి తమవిగాచూపించి నష్ట పరిహారాన్ని ఎగ్గొట్టిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నా రైల్వే శాఖ గాని, రెవెన్యూ శాఖ గాని పట్టించుకోవడం లేదు. అసలు ఆ ఫైళ్లు కనిపించడం లేదని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఇప్పుడు మళ్లీ నాలుగో రైల్వే లైన్ కోసం నోటిఫికేషన్ జారీ కావడంతో పాటు పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఒకపక్క తుమ్మికాపల్లి నుంచి కొత్తవలస వైపు, మరోపక్క కొత్తవలసలోని ఇతర ప్రాంతాల నుంచి పనులు చేసుకుంటూ వస్తోంది. నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుతో 105 కుటుంబాలకు చెందిన ఇళ్లు, వాణిజ్య సముదాయాలు మాత్రమే నష్టపోతాయని రైల్వే శాఖ గుర్తించింది. కానీ, బాధితులకు ఎంత నష్ట పరిహారం ఇస్తారో ప్రకటించలేదు. కనీసం అభిప్రాయ సేకరణ కోసం గ్రామ సభ కూడా ఏర్పాటు చేయలేదు. బాధితులు రైల్వే శాఖ అధికారులు, మండల, జిల్లా అధికారులతో పాటు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చుట్టూ తిరుగుతూ న్యాయం చేయాలని కోరుతున్నారు. నష్ట పరిహారం నాలుగు రెట్లు అధికంగా ఇవ్వాలని, ఇళ్లు , దుకాణాలు పోయిన వారందరికీ నిర్మాణ ఖర్చులు సైతం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి కుటుంబానికీ కనీసం మూడు సెంట్లు ఇళ్ల స్థలాన్ని కేటాయించాలని, వ్యాపారాలు చేసుకునే వారందరికీ ఒకేచోట స్థలం చూపించాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## సీఎం పర్యటనకు ఏర్పాట్లు



**నరసన్నపేట, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 16న నరసన్నపేట పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. జమ్ము, తామరాపల్లి వద్ద ప్రతిపాదిత స్థలాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. హెలీప్యాడ్ స్థల అనుకూలతలపై అధికారులతో చర్చించారు. హెలీప్యాడ్ స్థల విస్తీర్ణం మ్యాప్ ద్వారా నిశితంగా పరిశీలించారు. వాహనాల పార్కింగ్, వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గం తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. హెలీప్యాడ్ స్థల మైదానాన్ని త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో వేణుగోపాలరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ తిరుపతిరావు, తహసీల్దార్ సత్యనారాయణ, టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు గణేష్, రంజిత్ పాల్గొన్నారు.

## కొనుగోళ్లు ఆపి.. పొగాకు రైతుల నిరసన



**ప్రకాశం, పతాకం న్యూస్:** కొనుగోలు వేలం కేంద్రానికి తీసుకొచ్చిన పొగాకు చెక్కులను నోబిడ్ ల వంకతో తిరిగి వెనక్కి పంపిస్తుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం రైతులు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రపాడు, గాడిపర్తివారిపాలెం గ్రామాలకు చెందిన దాదాపు 350కు పైగా పొగాకు చెక్కులను రైతులు వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. నోబిడ్ ల వంకతో 70 శాతం చెక్కులను వెనక్కి పంపడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు కొనుగోలు కేంద్రాన్ని నిలుపుదల చేశారు. వెంటనే విషయం తెలుసుకున్న రైతు సంఘం నాయకులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జజ్జర జయంత్ బాబు మాట్లాడుతూ .... మార్కెట్లో పొగాకు సంక్షోభం ఉండడం, బయ్యర్ లు ఆసక్తి చూపకపోవడం, కర్నాటక మార్కెట్ ఇంకా క్లోజ్ చేయకపోవడంతో సరైన ధరలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు చెక్కులు బాగాలేవన్న నెపంతో తూతూ మంత్రంగా కొనుగోలు చేసి మిగతా వాటిని వెనక్కి పంపిస్తున్నారని తెలిపారు. సరైన ధరలు లేకపోవడంతో రైతులకు బ్యారెన్ కు వచ్చి రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈనెల 18వ తేదీన పొగాకు రైతుల సమస్యల మీద ఒంగోలులోని రంగా భవనంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## భీమసింగి వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం..



**జామి, పతాకం న్యూస్:** మండలంలోని భీమసింగి వంతెన కింద పిల్లర్లకు అనుసంధానంగా ఉన్న మట్టిని కొద్దిరోజుల కిందట ఇక్కడ రైల్వే పనులు నిర్వహించే కాంట్రాక్టర్ తవ్వి తమ పనులకు వినియోగించారు. దీంతో ఇది వంతెన మనుగడకు ప్రమాదమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసి, ఆ పనులను అడ్డుకున్నారు. అలాగే రెవెన్యూ అధికారులు వెళ్లి, హెచ్చరించారు.

దీనికి స్పందించిన కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్లు.. తెలియక మట్టి తవ్వాం.. యాధావిధిగా కప్పేస్తామని తెలిపారు. వెంటనే మట్టి కప్పే ఏర్పాట్లు మొదలుపెట్టారు. గత రెండు రోజులుగా కొన్ని పిల్లర్ల కింద తీసిన మట్టిని యధావిధిగా కప్పారు. మిగత పిల్లర్ల వద్ద తీసిన మట్టిని పూడ్చకుండా వదిలేశారు. దీనిపై సంబంధిత పనివారిని స్థానికులు పశ్నించగా.. ఎందుకు అంత గాబరా ఇక్కడ రైల్వే పనులకు మట్టి తవ్వకాలు మొదలుపెడతాం.. అప్పుడే వీటిని కప్పేస్తాం.. అంటూ నిర్లక్ష్యదోరణితో చెప్పారు. ఈ వంతెనపై నిత్యం వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి.. ఈ పిల్లర్లు బలంగా లేకపోతే ఎలా.. అంటూ యువత ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సదరు కాంట్రాక్టర్‌తో మట్టి కప్పించే ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



**సంతకవిటి, పతాకం న్యూస్:** ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. మండల పరి ధిలోని మండవకురిటి జడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో నిర్వహించిన బడి పిలుస్తోంది కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం రమణమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యంలో 12 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం ప్రభుత్వ పాఠశాలలను సకల సౌకర్యాలతో అభి వృద్ధి చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొల్ల అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్య క్షుడు గట్టి భాను, రాజాం నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేష్, సంతకవిటి పీఏసీ ఎస్ చైర్మన్ చెలికాని మహేష్‌కుమార్, రాజాం ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి గురవాన నారాయణరావు, టీడీపీ నా యకులు సమతం శ్రీను, కైలాస్, సాంబశివ పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



**భోగాపురం, పతాకం న్యూస్:** మండలంలోని రాజాపులోవ పంచాయతీ మహరాజపేట గ్రామానికి చెందిన రౌతు మహేష్ (21) ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ వి.పాపారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహరాజ పేటకు చెందిన రౌతు మహేష్‌కు తల్లి పైడిరాజుతో పాటు సోదరి పుష్ప ఉన్నారు. మహేష్ చిన్నతనంలో తండ్రి మృతిచెందారు. దీంతో తల్లి పైడిరాజు కుటాంబాన్ని పోషించుకుంటూ వస్తోంది. మహేష్ అప్పుడప్పుడు ఏపని ఉంటే ఆ పనికి వెళ్తుండేవాడు. మహేష్ సోదరి పుష్పకు ఇటీవల వివాహం అయ్యింది. దీంతో ప్రస్తుతం మహేష్ తన తల్లితో పాటు నివాసం ఉంటున్నాడు. అయితే కుటుంబ పరిస్థితులు బాగోక, చేయడానికి ఏపని దొరకక, తల్లి పడుతున్న ఇబ్బందులు చూడలేక మహేష్ మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. పైడిరాజు ఎప్పటిలాగే తగర పువలస పనికి వెళ్లి, రాత్రి ఇంటికొచ్చి చూసేసరికి.. మహేష్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఉన్నాడు. తన కుమారుడు మృతిచెంది ఉన్నట్టు గుర్తించిన తల్లి గగ్గోలు పెట్టింది. పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.పాపారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీఎస్పీ కానిస్టేబుల్ దారుణ హత్య




**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ సిటీ గాంధీనగర్ ప్రాంతంలో చోటుచేసుకున్న దారుణ ఘటన స్థానికులను భయాందోళనలకు గురు చేసింది. ఏపీఎస్పీ కానిస్టేబుల్ జి నాగేశ్వరరావు(46) ను గుర్తు తెలియని వ్యక్తులు రామారావు పేటలో గల రెడ్ క్రాస్ సమీపంలో హత్య చేశారు. రెడ్ క్రాస్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నాగేశ్వరరావును గుర్తుతెలియని దుండగులు దాడి చేసి పరారైన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితుడు రోడ్డుపై నడుస్తు వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా దాడి జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ దాడితో అక్కడున్న స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, టూ టౌన్ సీఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటన ప్రాంతం, పరిసర ప్రాంతాల పరిస్థితులను పోలీసులు, క్రూస్ టీం పరిశీలించింది. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దుండగుల కదలికలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటన పాత కక్షలా లేక వ్యక్తిగత కక్షల అనేదానిపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అందరి సహకారంతో పోలమాంబ వనంగుడి పునర్నిర్మాణం: మంత్రి సంధ్యారాణి



**మక్కువ, పతాకం న్యూస్:** అందరి సహకారంతో శంబర పోలమాబ వనం గుడి పునర్నిర్మాణం చేపడతామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. వనం గుడి ఆవరణలో పోలమాంబ ధర్మకర్తల మండలి చైర్మన్ చినతిరుపతి, ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వనంగుడి పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు శంబర గ్రామస్థులు, భక్తులు సహకరించాలని కోరారు. గ్రామపెద్దలు, దాతలు ముందుకొచ్చి విరాళాలు సేకరించా లన్నారు. ప్రభుత్వం నుంచి మరికొన్ని నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. పండితుల సూచనల మేరకు గుడి పునర్నిర్మాణం ప్రారంభించాలని దేవదాయ శాఖాధికారులను ఆదేశించారు. అంతకుముందు వనంగుడిలో పోలమాంబను దర్శించుకుని పూజలు జరిపారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి హారతులిచ్చారు. కాగా వనంగుడిలో విగ్రహ స్థల మార్పిడి చేయాలంటే ముందుగా శాంతిహోమం నిర్వహించాలని, తలనీలాలు, మొక్కులు తీర్చుకునేందుకు వేర్వేరుగా గదులు నిర్మించాలని, భక్తుల వంటావార్పునకు వీలుగా ఏర్పాట్లు చేయాలని పులువురు పెద్దలు కోరారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఫైనాన్స్ వ్యాపారంలో ఆర్థిక నష్టం రావడంతో మానసిక వేదనకు గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం పట్టణం కొత్తవలస రాజీవ్ కొత్తపోలమ్మ కాలనీకి చెందిన రౌతు కృష్ణ పెద్దకు మారుడు శివకుమార్ (33) కొన్ని సంవత్సరాల నుంచి ప్రైవేట్ ఫైనాన్స్ నడుపుతున్నాడు. అయితే ఫైనాన్స్ వల్ల ఆర్థికంగా నష్టం కలగడంతో తండ్రితో పాటు కుటుంబ సభ్యులు కొంతవరకు అప్పులు తీర్చారు. అయినప్పటికీ ఇంకా అప్పులు ఉండడంతో గత కొన్ని నెలలుగా శివకుమార్ తన నివాసంలో ఉంటూ తీవ్రమైన మానసికమైన వేదనకు గురైయ్యాడు. తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకు న్నాడు. కుటుంబ సభ్యులు గుర్తిం చి పట్టణ పోలీసులకు తెలియజేశారు. ఎస్‌ఐ గోవిందరావు, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 2047 నాటికి 2000 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యమే లక్ష్యం: గౌతమ్ అదానీ



**ముంబై, పతాకం న్యూస్:** భారత్ ప్రయాణం అమెరికా లేదా చైనా మార్గంలో ఉండదని, మనం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కాకుండా.. సజీవంగా, ఎదుగుతున్న, డిమాండ్ ఉన్న భారతదేశం కోసం పునాదులు వేస్తున్నామని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. నేడు 'సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్ 2026'లో ఆయన ప్రసంగిస్తూ, భారత వృద్ధి పథంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారత వృద్ధి సాధారణమైనది కాదని, ఇది కాంపౌండింగ్ పద్ధతిలో వేగంగా దూసుకెళుతోందని అదానీ వివరించారు. "స్వాతంత్ర్యం తర్వాత 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి భారత్‌కు 67 ఏళ్లు పడితే, తర్వాతి 2 ట్రిలియన్ డాలర్లను కేవలం 12 ఏళ్లలోనే జోడించగలిగాం. ఈ వేగంతో వెళితే, ప్రతి దశాబ్దానికి భారత్ తన జీడీపీకి ఒక కొత్త యూరోపియన్ ఆర్థిక వ్యవస్థకు సమానమైన మొత్తాన్ని జోడిస్తుంది. ఇది లీనియర్ వృద్ధి కాదు, కాంపౌండింగ్ యాక్సిలరేషన్" అని ఆయన నొక్కి చెప్పారు. ఇంధన రంగంలో భారత్ అసాధారణ ప్రగతి సాధించిందని తెలిపారు. 2026 మార్చి నాటికి 500 గిగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని దాటామని, ఇందులో 53 శాతం గత పదేళ్లలోనే వచ్చిందని చెప్పారు. 2047 నాటికి దీన్ని 2000 గిగావాట్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. భవిష్యత్ టెక్నాలజీ అయిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై పాశ్చాత్య దేశాల భయాలను భారత్ దిగుమతి చేసుకోవద్దని అదానీ సూచించారు. "ఏఐ ఉద్యోగాలను తొలగిస్తుందనే వాదనను నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాను. టెక్నాలజీ మానవ తీర్పును భర్తీ చేయదు. ఏఐ ఉత్పాదకతను పెంచి, కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది, చిన్న వ్యాపారాలను శక్తిమంతం చేస్తుంది" అని భరోసా ఇచ్చారు. ఏఐ వల్ల డేటా సెంటర్ల అవసరం భారీగా పెరుగుతుందని, 2047 నాటికి వాటి సామర్థ్యం 75 గిగావాట్లకు చేరవచ్చని అంచనా వేశారు. యూపీఐ విజయాన్ని ఉదాహరణగా చూపుతూ.. "యూపీఐ కేవలం చెల్లింపుల వ్యవస్థ కాదు. అది సామాన్యుడి చేతిలో నమ్మకాన్ని పెట్టి, ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిని చేసిం

## నూజివీడు సుందరీకరణకు శ్రీకారం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నూజివీడు పురపాలక సంఘంగా ఏర్పడి 43 ఏళ్లు గడిచింది. అయినా ప్రధాన వీధుల్లో ఎలాంటి మార్పు లేదు. పట్టణంలో ప్రధాన రోడ్లు ఇరుకుగా ఉండడం పెరిగిన ట్రాఫిక్‌తో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రెండుసార్లు ప్రధాన వీధుల విస్తరణకు గత పాలకులు ప్రయత్నించినా ఓట్లు రాజకీయంతో విస్తరణ సాధ్యపడలేదు. నూజివీడు చుట్టు పక్కల ఉన్న ప్రధాన పంచాయతీలైన హను మాన్ జంక్షన్, విస్సన్నపేట, తిరువూరులలో మాత్రం ప్రధాన వీధులను ఇప్పటికే డివైడర్లు ఏర్పాటు చేసి విస్తరణ జరిపారు. ఎట్టకేలకు ప్రధాన వీధుల విస్తరణకు శ్రీకారం జరిగింది. మంత్రి పార్థసారథి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రధాన వీధుల విస్తరణ జరిపి నూజివీడు పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేశారు. ఆ మేరకు అమలులో భాగంగానే నూజివీడు ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర నుంచి పెట్రోల్ బంక్ సెంటర్ వరకు రహదారి విస్తరణ జరిపి డివైడర్‌ను ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. ఈప్రాంతం వరకు ప్రభుత్వ భూమి ఉంది. మొగల్ చెరువు వద్ద గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై వివిధ షాపులు నిర్మించబడి ఉన్నాయి. వీటిని ఖాళీ చేయించి ఆ ప్రాంతంలో పురపాలక సంఘం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అక్రమణదారులకే అద్దెకు ఇవ్వడానికి మంత్రి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు ఆక్ర మణదారులను ఒప్పించారు. అయితే ఈ నిర్మాణం వల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఉపయోగ పడదు. అసలు ట్రాఫిక్ సమస్య పెట్రోల్ బంక్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు, చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పెద్ద చెరువు కళింగ వరకు రహదారిని విస్తరించి డివైడర్లను ఏర్పాటు చేసినప్పుడే ట్రాఫిక్ సమస్యకు కొంత వరకు పరిష్కారం లభిస్తుంది. ఈప్రాంతం అంతా కమర్షియల్ ప్రాంతం కావడంతో రహదారికి రెండు వైపులా భూసేకరణ జరపాలంటే నిబంధనల ప్రకారం అధిక వ్యయం అవుతుంది. సుమారు మూడు న్నర కిలోమీటర్ల వరకు రహదారి విస్తరణను జరిపినప్పుడే పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఒక కొలిక్కి వస్తుంది. ఈ దిశగా మొదటి ఫేజ్‌లో భాగంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పెట్రోల్ బంక్ వరకు డివైడర్‌తో రహదారి విస్తరణ జరపడానికి మంత్రి సారథి ప్రభుత్వాన్ని ఒప్పించారు. ప్రస్తుతం జరుగుతున్న రహదారి విస్తరణ పక్కనే ఉన్న మొగల్ చెరువులోకి పట్టణంలోని ప్రధాన డ్రెయిన్‌ల నుంచి మురుగునీరు చేరు తోంది. ఈ రహదారి విస్తరణలో భాగంగానే ఈ చెరువు కట్టను బలపరిచి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాల్సి వుంది. చెరువులోని మురుగునీరు వల్ల దుర్గంధం వ్యాపిస్తోంది. దీని నివారణకు ఈ చెరువులో కలిసే ప్రధాన ఓపెన్ డ్రెయిన్లను చెరువు వద్ద అనుసంధానం చేసి అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా నూజివీడులోని పోతిరెడ్డిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న డ్రెయిన్‌కు మళ్లిస్తే చెరువు చుట్టూ ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుంది.

## శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



**కడప, పతాకం న్యూస్:** కడప జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. కడప నగరంలోని అల్లర్లకు జరిగిన అల్మాస్‌పేట సర్కిల్ ప్రాంతాన్ని జెసి నిధి మీనాతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ అసాంఘిక శక్తుల ప్రభావం వల్ల అల్మాస్‌పేటలో అల్లర్లు చోటుచేసుకున్నాయని చెప్పారు. మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలిచిన కడప నగరంలో ఇటువంటి అల్లర్లు చోటు చేసుకోవడం దారుణమన్నారు. సోషల్ మీడియా ద్వారా వాస్తవాలు ప్రజల్లోకి వెళ్తున్నాయని, వాస్తవాలు అందించేలా సామాజిక బాధ్యతలు ఉండాలే తప్ప ప్రజలను భయం గొలిపేలా రెచ్చగొట్టేలా ఉండకూడదని చెప్పారు. అల్లర్ల ఘటన పట్ల పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించి గట్టి చర్యలు చేపట్టిందన్నారు. 144 సెక్షన్ అమలు చేసి అల్లర్లు లేకుండా చేసి ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూస్తామని చెప్పారు. ప్రజలందరూ సమైక్య వాతావరణంలో మెలిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా, నగర ప్రజల శాంతికి ఎలాంటి విఘాతం కలగకుండా అధికార యంత్రాంగం గట్టి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి నియోజకవర్గం ప్రజలతోపాటు నందిగాం మండల ప్రజానీకం నుంచి వివిధ సమస్యలపై వినత పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా.. ఆయన ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే మండలం పెద్దబమ్మిడి గ్రామంలో నిర్వహిస్తున్న కోదండరామాలయ వార్షికోత్సవానికి హాజరుకావాలని ఆ గ్రామస్థులు మంత్రికి ఆహ్వానపత్రిక అందించారు. టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శిమ్మ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల నిర్మాణానికి బ్రేక్!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పేదల కోసం నగర శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో ఆప్షన్-3 కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి బ్రేక్ పడింది. బిల్లులకు గ్యారంటీ లేదనే వదంతులు రావడంతో చాలా కాలనీల్లో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. హౌసింగ్ అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారు. ఈ నేపథ్యంలో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ శివారు ప్రాంతాల్లో 73 లేఅవుట్‌లలో 1.1 లక్షల మందికి సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇచ్చారు. పలు కారణాలతో 85 వేల ఇళ్ల పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. ఇంటి నిర్మాణానికి పీఎంఏవై పథకం కింద మంజూరైన రూ.1.5 లక్షలకు అదనంగా రాష్ట్రం రూ.30 వేలు మంజూరుచేసింది. ఈ పథకంలో మూడు ఆప్షన్లు ఉన్నాయి. ఆప్షన్-1లో లబ్ధిదారుడు స్వయంగా ఇల్లు నిర్మించుకోవడం. ఆప్షన్-2 కింద ప్రభుత్వం మెటీరియల్ ఇస్తే లబ్ధిదారుడు ఇల్లు పూర్తిచేసుకోవడం. ఆప్షన్-3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వడం. ఆప్షన్-3 ఎంచుకున్న లబ్ధిదారులకు సంబంధించిన ఇళ్ల నిర్మాణాన్ని గత ప్రభుత్వం అనధికారికంగా కాంట్రాక్టర్లను అప్పగించింది. బిల్లుల్లో ఇబ్బంది లేకుండా లబ్ధిదారుడు-బ్యాంకు-కాంట్రాక్టర్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. దీని ప్రకారం లబ్ధిదారుడి ఖాతాకు వచ్చే నగదును బ్యాంకు అధికారులు సంబంధిత కాంట్రాక్టర్ ఖాతాకు జమ చేయాలి. అయితే మొదటి నుంచి అనుకున్న మేర పనులు జరగలేదు సరికదా కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై మెటీరియల్ విక్రయించేసి కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పలుమార్లు పథకం పురోగతిపై సమీక్షించినా క్షేత్రస్థాయిలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్ల వైఫల్యంతో ఇళ్ల నిర్మాణంలో అనుకున్న ప్రగతి కనిపించలేదు. దీంతో గత ఏడాది ఆరు నెలలపాటు బిల్లులు నిలిపివేశారు. చివరకు సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఈ ఏడాది జనవరిలో బిల్లులు మంజూరుచేసింది. ఆ తరువాత లేఅవుట్‌లలో పనులు అనుకున్నమేర సాగలేదు. ఇదిలావుండగా పీఎంఏవై పథకం గత ఏడాది డిసెంబరు 31తో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో ఈ ఏడాది మార్చి 31 వరకు పొడిగించారు. ఆ తరువాత చేపట్టిన పనులకు బిల్లుల మంజూరులో గ్యారంటీ ఇవ్వలేమని ఉన్నతాధికారులు చెప్పడంతో కాంట్రాక్టర్లు ఆలోచనలో పడ్డారు. ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వారు తప్ప మిగిలిన వారంతా పనులు నిలిపివేశారు.

గత నెలాఖరు నాటికి మొత్తం లేఅవుట్‌లలో 85 వేల ఇళ్లలో సుమారు 40 వేల పూర్తిచేయగా, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో చాలావరకు పునాదుల్లో ఉండిపోయారు. పీఎంఏవై కింద ఇచ్చిన నిధులలో ఇంకా మిగిలిన రూ.170 కోట్లను వెంటనే వెనక్కి పంపాలని కేంద్రం ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ విషయం అధికారుల ద్వారా తెలుసుకున్న కాంట్రాక్టర్లు పనులు కొనసాగించడానికి వెనుకంజ వేశారు. ఆ రూ.170 కోట్లు వెనక్కి ఇస్తే బిల్లులు వచ్చే అవకాశం లేదని పనులు నిలిపివేశారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభింపజేసేందుకు హౌసింగ్ ఉన్నతాధికారులు చొరవ తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు లబ్ధిదారులు మధ్యలో నిలిచిన తమ ఇల్లు చూసి ఆందోళన చెందుతున్నారు. పాలకులు జోక్యంచేసుకుని ఆప్షన్-3 కింద చేపట్టిన ఇళ్లను పూర్తి చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో దళారులదే రాజ్యం

**కాకినాడ, పతాకం న్యూస్:** ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. దీంతో, మద్దతు ధర లభించక అన్నదాతలు నష్టపోతున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇందులో ప్రభుత్వం కొన్నది 1.30 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ ఏడాది రబీలో ఎకరాకు సుమారు 45 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్న ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరిస్తుండడం, మేఘాలు, వర్షాలు భయపెడుతుండడంతో రైతులు గత్యంతరంలేని పరిస్థితుల్లో దళారులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్లో కాకినాడ జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకూ 1.65 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఇందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల (21.67 శాతం) ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం కళ్లాల్లోనే ఉంది. వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న నేపథ్యంలో వరి కోత, నూర్పిడి పనులను 95 శాతం మేర యంత్రాల ద్వారానే పూర్తి చేస్తున్నారు. ఈ ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కళ్లాల సౌకర్యం లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. 17 శాతం తేమ ఉండాలనే రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు నాలుగు రోజుల పాటు ఎండలో ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది.



దీంతో, పచ్చి ధాన్యాన్ని దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1,725, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.1,740 మద్దతు ధర ఇవ్వాలి. దళారులు కొన్ని ప్రాంతాల్లో 1250 నుంచి రూ.1300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.1,400 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

దీంతో, బస్తాపై రైతులు రూ.300 నుంచి రూ.400 వరకూ నష్టపోయారు. దళారికి 75 కిలోల బస్తా రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చిందని యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన రైతు చింతపల్లి వీరేంద్ర వాపోయాడు. తమ గ్రామంలో 70 శాతం మంది ఈ విధంగానే ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు.

# కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



**అమరావతి పతాకం న్యూస్:** కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. లేబర్ కోడ్స్ అమలుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలుచోట్ల నోటిఫై ప్రతులను దహనం చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంస్తోందని, తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే కార్మికులను బానిసలుగా చేసే, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే లేబర్ కోడ్స్ ను అమలు చేయడానికి నిబంధనలను విడుదల చేసిందని తెలిపారు. ఆ నిబంధనలు అమలైతే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, హక్కులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గెజిట్ కాపీలను దహనం చేశారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి, అచ్యుతాపురం, అల్లూరి జిల్లా అరకులోయ, పెదబయలు ప్రాంతాల్లోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరులో, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు కేంద్రాల్లో నిరసన తెలిపారు. నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశారు. భీమవరంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామనే గర్వంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం శ్రమజీవులపై దాడిని ప్రారంభించడం అత్యంత హేయమైన చర్య అని, లేబర్ కోడ్‌ల అమలుకు విడుదల చేసిన నోటిఫికేషన్ వెనుక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి యశోద నగర్ లోనిబి నోటిఫై ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.జయచంద్ర,టి.సుబ్రహ్మణ్యంబిమాట్లాడుతూ గతంలో కూడా బీహార్ ఎన్నికల అనంతరం లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ విడుదల చేసిందని గుర్తు చేశారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని తెలిపారు.

## అల్మాస్ పేట సర్కిల్‌ను పరిశీలించిన కర్నూలు రేంజ్ డిఐజి



**కడప, పతాకం న్యూస్:** రెండు గ్రూపుల మధ్య చిన్న ఘటనలో అనుకోకుండా రాళ్ల దాడి జరిగిందని, కొంతమంది పోలీస్ సిబ్బంది గాయపడడ్డారని కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. కడప నగరంలోని అల్మాస్ పేట సర్కిల్లో ఘటనా స్థలాన్ని ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ రాళ్ల దాడి చేసిన వాళ్లలో కొంతమందిని పోలీసులు అదుపులో ఉన్నారని, మరికొంత మంది పరారీలో ఉన్నారని చెప్పారు. వారి కోసం గాలింపు కొనసాగుతోదని చెప్పారు. ఫ్లాగ్ మార్చ్ కూడా ఎస్‌పి నిర్వహించారన్నారు. భారతదేశానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని, హిందువులకు వారి మత విశ్వాసాలు ఎంత ప్రగాఢమైనవో, మహమ్మదీయులకు కూడా వారి మత విశ్వాసాలు అంతే ప్రధానమైనవని తెలిపారు. ప్రభుత్వ పరంగా ఇరు గ్రూపుల వారిని సమతూల్యం పాటించి అందరి విశ్వాసాలకు ఎక్కడైతే సమస్య ఉందో సామరస్యపూర్వకంగా పరిష్కరించాల్సిన బాధ్యత పోలీస్, రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. దానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** నారాయణవలస సంత నుంచి అక్రమంగా విశాఖపట్నం వైపు తరలిస్తున్న పశువుల వాహనాన్ని ఎస్ఐ గణేష్ జమ్ము పంచాయతీ శివరాంపురం వద్ద పట్టుకున్నారు. తొమ్మిది ఆవులతో వెళుతున్న వాహనం ఎవరికి అనుమానం రాకుండా గడ్డెయ్యపేట మీదుగా శివరాంపురం నుంచి జాతీయ రహదారిపై తరలించే సమయంలో అక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వాహనంను పట్టుకున్నారు. పశువులను అక్రమంగా తరిలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి వాహన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. గోవులను గోశాలకు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో హీరో, సినిమాటోగ్రాఫర్ మృతి





**హైదరాబాద్, పతాకం న్యూస్:** టాలీవుడ్‌లో మరో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇవాళ తెల్లవారుజామున హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వర్ధమాన నటుడు భరత్ కాంత్ (31) మరియు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ త్రిలోక్ (31) దుర్మరణం పాలయ్యారు. తమ సొంతూరైన నెల్లూరు నుంచి కారులో బయలుదేరిన వీరు, ం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో బొంగుళూరు ఎగ్జిట్-12 వద్ద ఓ కంటైనర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వీరిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల విడుదలైన 'టెనెంట్' చిత్రంలో హీరోగా నటించిన భరత్ కాంత్, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుని కెరీర్‌లో ఎదుగుతున్న తరుణంలోనే ఈ విషాదం జరగడం అభిమానులను కలచివేస్తోంది. అలాగే పలు చిత్రాలకు పనిచేసిన ప్రతిభావంతుడైన సినిమాటోగ్రాఫర్ త్రిలోక్ కూడా మరణించడంతో చిత్ర పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 31 ఏళ్ల వయసులోనే ఇద్దరు యువ ప్రతిభావంతులు కన్నుమూయడం పట్ల సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## పట్టాలు ఇచ్చారు.. స్థలాలు మరిచారు : సీపీఎం




**సామర్లకోట, పతాకం న్యూస్:** పట్టాలు ఇచ్చిన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వా లని కోరుతూ .... సిపిఎం సామర్లకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ .... సామర్లకోట మండలం ఉండూరు, వేమవరం, కాపవరం, అచ్చంపేట, గొంచాల, పనసపాడు గ్రామాల పేద ప్రజలకు గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చి స్థలాలు ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని రెండేళ్లయినా స్థలాలు ఇవ్వలేదని చెప్పారు. ప్రజానీకం అద్దెలు కట్టలేక జీతాలు వేతనాలు పెరగక అధిక ధరలు తట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

## మత సామరస్యాన్ని పరిరక్షించుకుందాం




**నెల్లూరు, పతాకం న్యూస్:** కడపలో టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటు పనుల సందర్భంగా నెలకొన్న మత ఘర్షణ, ఉద్రిక్తతల నేపథ్యంలో నెల్లూరు నగరంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మతసామరస్యం వర్ధిల్లాలంటూ హిందూ, ముస్లిం సోదరులు కలిసి భారీ నిర్వహించారు. లౌకికవాదం వర్ధిల్లాలి... దేశ సమైక్యతను కాపాడుకుందాం... హిందూ ముస్లిం భాయ్ భాయ్... అంటూ నినదిస్తూ నెల్లూరు నగరంలోని అపోలో హాస్పిటల్ సెంటర్ నుండి చిల్డ్రన్స్ పార్క్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు, మాజీ ఎంఎల్ సి విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ హిందూ, ముస్లిముల ఐక్యతకు మన రాష్ట్రం ఓ ఉదాహరణగా నిలిచిందని గుర్తు చేశారు. కొన్ని సంఘ విద్రోహ శక్తులు చిన్నచిన్న విషయాలను ఏదో ఒక రకంగా పెద్దవి చేసి కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కల్పించే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కడపలో జరిగిన ఘటన ఎంతో బాధాకరమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టించేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిస్టీ మాట్లాడుతూ దేశ సమైక్యత, మతసామరస్యం కోసం లౌకిక వాతావరణ నిర్మాణానికి ఆవాజ్ రాష్ట్ర మహాసభ నగరంలో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం మోహన్ రావు, కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, కట్టా సతీష్, పి.సూర్యనారాయణ, మూలి వెంగయ్య, కె.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసుల రెడ్డి, పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి.. ఆగిన బస్సులు




**చిలకలూరిపేట, పతాకం న్యూస్:** ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ పై జరిపిన దాడిని నిరసిస్తూ .... సోమవారం చిలకలూరిపేట బస్టాండ్ లో ఆర్టిసి సిబ్బంది ధర్నాకు దిగారు. బాధ్యులను అరెస్టు చేసే వరకు బస్సులు నడపబోమని తేల్చి చెప్పారు. డిపో మేనేజర్ వేణు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బస్సుల నిలిపివేతతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# కాబోయే అమ్మలకు 'పోషకాలు' అందాలి

మహిళలు గర్భం దాల్చగానే ఇంట్లో వాళ్లందరి ఫోకస్ ఆమె మీదే ఉంటుంది. ఇది తిను, అది వద్దు అంటూ సవాలక్ష సలహాలు, సూచనలు ఇస్తూ ఉంటారు. బిడ్డ పుట్టాక కూడా ఇదే వరుస. ఇద్దరికీ సరిపడా ఆహారం తినాలని అంటారు. ఈ క్రమంలో గర్భిణులు, బాలింతలు రోజు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!

గర్భిణులు, బాలింతలకీ అదనపు పోషకాలు తప్పనిసరి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకూ అంటే, 270 రోజులు, ఆ తరవాత బిడ్డకి రెండో ఏడాది నిండేవరకూ అంటే, 730 రోజులు, మొత్తం 1000 రోజులు తల్లి పోషకాహారంపై ఆధారపడి ఉంటుందని అధ్యయనం పేర్కొంది. ఈ ఆహారమే బిడ్డ శారీరక, మానసిక పెరుగుదల, రోగనిరోధకశక్తిని ప్రభావితం చేస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పోషకాహార లోపం వల్ల బిడ్డ తక్కువ బరువుతో పుట్టే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. అలా ఉన్న పిల్లలు తరచూ ఇన్ఫెక్షన్ల బారినపడటం, ఎత్తు తక్కువగా ఉండటం, పెద్దయ్యాక డయాబెటిస్, బీపీలతో పాటు గుండె, జీవక్రియా వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే, ఇలాంటప్పుడు తల్లికి సమతులాహారం తప్పనిసరని సూచిస్తున్నారు. సాధారణ బరువున్న వాళ్లు సుమారు 10 నుంచి 12 కిలోల వరకూ బరువు పెరగొచ్చని తెలియజేస్తున్నారు. 2 నుంచి 3 నెల వరకూ గర్భిణీకి రోజువారీ ఆహారంలో 350 క్యాలరీల శక్తి అవసరమవుతుందని ఐసీఎంఆర్-ఎన్?ఐఎన్ సీనియర్ రిటైర్డ్ సైంటిస్ట్ కె. దమయంతి చెబుతున్నారు. ఆహారంలో 8- 18 గ్రా ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలని అంటున్నారు. పాలిచ్చేటప్పుడయితే మొదటి ఆరు నెలల్లో రోజువారీ ఆహారంలో 600 క్యాలరీలు, 13.6 గ్రా ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. 6-12 నెలల మధ్యలో 520 క్యాలరీలు, 10.6గ్రా ప్రొటీన్ ఉండాలని పేర్కొంటున్నారు. మహిళలు ప్రసవం తర్వాత మొదటి సంవత్సరం పాటు ప్రతిరోజూ 290 మైక్రోగ్రాములు అయోడిన్, 550 మిల్లీగ్రాముల కోలిన్ తీసుకోవాలని అధ్యయనం పేర్కొంది.



గర్భిణులకీ సూక్ష్మ పోషకాలూ కీలకమే. గర్భం దాల్చిన తొలి 28 రోజుల్లో తీసుకునే ఫోలిక్ ఆమ్లం బిడ్డలో నాడీ లోపాలు తలెత్తకుండా చేయడంతో పాటు తల్లిలో రక్తహీనతనూ తగ్గిస్తుందని కె. దమయంతి అంటున్నారు. రక్తకణాల నిర్మాణానికి తల్లికీ బిడ్డకీ ఐరన్ కూడా అదనంగా కావాలని, ఐరన్ లోపిస్తే తల్లికి ప్రాణాపాయ పరిస్థితి, బిడ్డ తక్కువ బరువుతో పుట్టడం లాంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. దంతాలు, ఎముకల నిర్మాణానికి విటమిన్-డి, కాల్షియం అవసరమని, ఇవి సమృద్ధిగా అందితే భవిష్యత్తులో తల్లికి ఆస్టియోపొరోసిస్ సమస్య రాదని వివరిస్తున్నారు. విటమిన్-ఎ, అయొడిన్‌లు శిశువు మెదడు, శారీరక పెరుగుదలకి తోడ్పడతాయని తెలియజేస్తున్నారు. వీటితో పాటు బి12, సి తగుపాళ్లలో అవసరమవుతాయని చెబుతున్నారు. కాబట్టి, ఆహారంతో పాటు డాక్టర్ల సూచనల మేరకు గర్భంతో ఉన్నప్పుడే కాదు, చనుబాలిచ్చేటప్పుడు కూడా ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి సప్లిమెంట్లు వాడాలని సూచిస్తున్నారు. గర్భధారణ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారంలో తగినంత శక్తి, ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవి కూరగాయలు, మాంసం, చేపలు, బీన్స్, గింజలు, పాశ్చరైజ్డ్ పాల ఉత్పత్తులు, పండ్లతో సహా వివిధ రకాల ఆహార పదార్థాల వినియోగం ద్వారా లభిస్తాయని అధ్యయనం పేర్కొంది.ఖనిజాలు, విటమిన్ల కోసం బీన్స్, డ్రైఫ్రూట్స్ మంచి వనరులని కె. దమయంతి తెలియజేస్తున్నారు. ఆకుకూరలు, చిక్కుళ్లు, నట్స్, కాలేయం ఫోలిక్ ఆమ్లానికి మంచి వనరులని, వీటితో పాటు మొదటి మూడు నెలల్లో 0.5 మి.గ్రా ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్ తీసుకోవడం మేలని వివరిస్తున్నారు. మాంసం, చేపలు, పౌల్ట్రీ ఉత్పత్తులు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, ఎండిన పండ్లలో ఐరన్ ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. జామ, పైనాపిల్, సిట్రస్ పండ్లలో విటమిన్-సి అధికంగా ఉంటుందని, వీటివల్ల ఐరన్ శోషణ కూడా బాగుంటుందంటున్నారు. మరీ ముఖ్యంగా ఆకు కూరలు, పప్పు లేదా గుడ్డు లాంటివి క్రమం తప్పకుండా తీసుకోవాలని చెబుతున్నారు. రోజుకు రెండు లీటర్ల నీళ్లు తీసు కోవాలి. టీ, కాఫీలు ఎక్కువగా తీసుకోకూడదు. టీ, కాఫీలు అనేవి ఐరన్?ను గ్రహించేందుకు అడ్డుపడతాయి. ఫైబర్ ఎక్కువున్న కూరగాయలు తీసుకోవాలి. 1000 క్యాలరీల ఆహారంలో 25 గ్రా. ఫైబర్ ఉండాలి.నిల్వ ఉన్నవి, శుభ్రత లోపించిన వాటికి దూరంగా ఉండాలి. ఎక్కువగా షుగర్, ఉప్పు ఉన్నవి పిండం పెరుగుదలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. భోజనానికి ముందూ లేదా భోజన సమయంలో సప్లిమెంట్లను తీసుకోరాదు.

# సోలార్ పార్కుల ఏర్పాటు పేరుతో రిలయన్స్‌కు 90 వేల ఎకరాలు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం!



**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లాలో రిలయన్స్ సంస్థకు భారీగా భూ పందేరానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఓబుళదేవరచెరువు, నల్లమాడ, ఆమడగూరు మండలాల పరిధిలోని సుమారు 90 వేల ఎకరాల భూములను సోలార్ పార్కుల ఏర్పాటు పేరుతో లీజు పద్ధతిలో కట్టబెట్టాలని చూస్తోంది. ఇందుకుగానూ మూడు మండలాల్లో 14 గ్రామాలను ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో సోలార్ పార్కుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ఇది వరకే న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ ఫీజిబులిటీ రిపోర్టును రూపొందించింది. ఇప్పుడు ప్రభుత్వం రిలయన్స్‌కు మార్గం సుగుమం చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటోంది. సోలార్ పరిశ్రమల వల్ల ఉపాధి ఏ మేరకు లభిస్తుందన్నది ప్రశ్నార్థకమే. ఎందుకంటే ఇప్పటి వరకున్న సోలార్ ప్లాంట్లలో ఉపాధి అంతంత మాత్రమే. రిలయన్స్ వంటి బడా కార్పొరేట్ సంస్థ మరింత ఆధునాత టెక్నాలజీతో సోలార్ పార్కులను ఏర్పాటు చేయనుంది. దీంతో, ఉపాధి నామమాత్రమే కానుందనే చర్చ సాగుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాలో నల్లమాడ మండలం రెడ్డిపల్లి, గోపేపల్లి, దొన్నికోట, కురమాల, ఓబుళదేవరచెరువు మండలంలో నరసంబొట్లపల్లి, డబరువారిపల్లి, తిప్పేపల్లి, సున్నంపల్లి, ఓబుళదేవరచెరవు, వెంకటాపురం, ఆమడగూరు మండలంలో ఎస్.కురపల్లి, జెకె.కొత్తపల్లి, తుమ్మల, పూలకుంటపల్లి గ్రామాలు సోలార్ పార్కుల ఏర్పాటుకు అనువైనదిగా గుర్తించారు. ఏ గ్రామంలో ఎంత భూమిని కట్టబెట్టేందుకు వీలుందన్న అంశాలను కూడా ఆ నివేదికలో పొందుపర్చారు. మొత్తం 64,343 ఎకరాలను రియలన్స్‌కు అప్పగించేందుకు వీలుందని పేర్కొన్నారు. ఇందులో జిరాయితీ భూములు 46,184 ఎకరాలు, అసైన్డు భూములు 6,031 ఎకరాలు , ప్రభుత్వ భూములు 12,128 ఎకరాలు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 12 వేల ఎకరాలు అటవీ భూములతోపాటు కొండలు, గుట్టలు అనువుగా ఉన్నాయని మొత్తం 90 వేల ఎకరాలు అవసరమని ఆ నివేదికలో పొందుపర్చారు.

ప్రభుత్వ సహకారంలో రైతుల నుంచి లీజు పద్ధతిలో భూములను రిలయన్స్ సంస్థ లాక్కోవడానికి రంగం సిద్ధమైంది. భూములు పోతే గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. సోలార్ పార్కుల కోసం లీజు పద్ధతిలో భూములను కంపెనీలు లాక్కొంటున్నాయి. ఏడాదికి రూ.30 వేల చొప్పున భూ యజమానికి లీజు ఇచ్చేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతుల నుంచి భూములను ప్రభుత్వ సహకారంతో గుంజుకుంటున్నాయి. ఈ భూములు సోలార్ కంపెనీలకు ఇచ్చాక గ్రామాల్లో ఉపాధి లేకుండాపోతోంది. ఇప్పటికే ఎన్‌పి కుంట మండలంలో వెయ్యి మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ రావడంతో పక్కనున్న గ్రామాలు ఖాళీ అయ్యాయి. కదిరి ప్రాంతంలో నాగిరెడ్డి పల్లి గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సోలార్ పార్కులు భారీ ఎత్తున వస్తోన్న నేపథ్యంలో గ్రామాలకు గ్రామాలు ఖాళీ కానున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఇరాన్ షరతులను తిరస్కరించిన ట్రంప్



**న్యూయార్క్:** పాకిస్తానీ మధ్యవర్తుల ద్వారా అమెరికా ప్రతిపాదించిన తాజా కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరాన్ ఇచ్చిన ప్రతిస్పందనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. 'యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని' ఇరాన్ ప్రతిపాదించిన షరతులు "పూర్తిగా ఆమోదయోగ్యం కావు" అని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో దాదాపు పది వారాలుగా కొనసాగుతున్న ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు సాగుతున్న దౌత్య ప్రయత్నాలు మరోసారి అనిశ్చితిలో పడ్డాయి. ఇరాన్, లెబనాన్ సహా మధ్యప్రాచ్యంలోని అన్ని రంగాల్లో శాంతి నెలకొనాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. అయితే, హిజ్బుల్లాకు మద్దతు కొనసాగిస్తున్న ఇరాన్, కాల్పుల విరమణ ఒప్పందంలో సముద్ర వాణిజ్య మార్గాల భద్రత అంశాన్ని కూడా చేర్చాలని డిమాండ్ చేసింది. దీనికి ప్రతిగా, ఇరాన్ తన అణు కార్యక్రమాలను పూర్తిగా ఉపసంహరించుకోవాలన్న షరతుపై ఎలాంటి రాజీ ఉండదని అమెరికా స్పష్టం చేసింది. "గత 50 ఏళ్లుగా ఇరాన్ అమెరికాను మోసం చేస్తోంది. ఇకపై అలాంటిది జరగదు" అని ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచాయి. ఇదిలా ఉండగా, యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బహిరంగంగా స్పందించారు. సైనిక కమాండ్ అధికారులతో సమావేశమైన ఆయన, శత్రువుపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఫిబ్రవరిలో అలీ ఖమేనీ మరణం అనంతరం ముజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన గాయపడ్డారన్న ప్రచారం మధ్య ఈ ప్రకటన వెలువడడం ప్రాధాన్యం సంతరించుకుంది. దౌత్య చర్చలు కొనసాగుతున్న సమయంలోనే ప్రాంతంలో కొత్త భద్రతా ఘటనలు చోటుచేసుకున్నాయి. ఖతార్ సమీపంలో ఓ నౌకపై డ్రోన్ దాడి జరగడంతో మంటలు చెలరేగినట్లు నివేదికలు వెల్లడించాయి. దీనిని "ప్రమాదకర రెచ్చగొట్టే చర్య"గా ఖతార్ అభివర్ణించింది. అదేవిధంగా, తమ గగనతలంలోకి ప్రవేశించిన ఇరాన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు యుఎఈ ప్రకటించింది. ఇదే తరహా డ్రోన్ నిరోధక చర్యలు చేపట్టినట్లు కువైట్ కూడా ధృవీకరించింది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత విస్తరించకుండా అమెరికా మిత్రదేశాలు చివరి దశ శాంతి ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ, ట్రంప్ మరియు ఇరాన్ తీసుకుంటున్న కఠిన వైఖరులు మరో పెద్ద సైనిక ఘర్షణకు దారితీసే ప్రమాదాన్ని సూచిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# ఐసీసీ వన్డే వార్షిక ర్యాంకింగ్స్.. అగ్రస్థానంలో టీమిండియా



వన్డే వార్షిక ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. భారత జట్టు 118 రేటింగ్ పాయింట్లతో మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ జాబితాలోనూ టీమిండియానే అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ 2026 గెలవడంతో పొట్టి ఫార్మాట్‌లోనూ భారత్ పై చేయి సాధించింది. కాగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో ఘన విజయం సాధించిన టీమిండియా.. తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో తమ ఆధిపత్యాన్ని చాటింది. న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో స్థానంలో కొనసాగుతోంది. అయితే భారత్ కంటే న్యూజిలాండ్ కేవలం 5 పాయింట్ల తేడాతోనే రెండో స్థానంలో ఉండటం విశేషం. అద్భుత ప్రదర్శనలతో వరుస విజయాలు సాధించిన సౌతాఫ్రికా 102 పాయింట్లతో నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్(98)ను వెనక్కి నెట్టింది. ఇదిలా ఉంటే, ఇదొక్కటి తప్పించి టాప్ 10 జట్ల జాబితాలో ఎలాంటి మార్పు లేదు. శ్రీలంక(96), అఫ్ఘానిస్థాన్(93), ఇంగ్లండ్(89), బంగ్లాదేశ్(84), వెస్టిండీస్(74) పాయింట్లతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానానికి పడిపోయింది. మరోవైపు అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకి స్కాట్లాండ్‌ను అధిగమించింది. స్కాట్లాండ్ ప్రస్తుతం 44 పాయింట్లతో 14వ స్థానంలో ఉంది. ఐసీసీ ప్రకటించిన నిబంధనల ప్రకారం 2027 మార్చి 31 నాటికి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ 8లో నిలిచే జట్లు నేరుగా వన్డే వరల్డ్ కప్ 2027కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి నేరుగా అర్హత పొందాయి. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా టాప్ 8లోనే కొనసాగితే 9వ స్థానంలో ఉన్న మరో జట్టుకు ప్రత్యక్ష అర్హత లభించే అవకాశం ఏర్పడనుంది. దీంతో ప్రస్తుతం 9వ స్థానం కోసం పోటీ ఆసక్తికరంగా మారింది.

## రాణించిన ఉర్విల్ పటేల్ ..

# చెన్నై సూపర్ కింగ్స్ విజయం



ప్రతి బంతినీ బౌండరీకి తరలిస్తూ ఛేదనలో ఉప్పెనలా విరచుకుపడ్డ ఉర్విల్ పటేల్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లతో 65) రికార్డుస్థాయిలో 13 బంతుల్లోనే అర్ధ శతకం బాదగా.. అంతకుముందు ఓవర్టన్ (3/36) తనదైన బౌలింగ్‌తో కీలక బ్యాటర్లకు కళ్లెం వేయడంతో ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ హ్యాట్రిక్ కొట్టింది. ఈ మ్యాచ్‌లో చెన్నై 5 వికెట్లతో లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌ను చిత్తుచేసి వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. తొలుత లఖ్‌నవూ 20 ఓవర్లలో 8 వికెట్లకు 203 పరుగులు చేసింది. ఇన్‌గ్లి?స (33 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 85), షాబాజ్ అహ్మద్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 43 నాటౌట్) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఛేదనలో చెన్నై 19.2 ఓవర్లలో 208/5 స్కోరు చేసి గెలిచింది. ఉర్విల్ తర్వాత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 42)ది టాప్‌స్కోర్. సంజూ శాంసన్ (14 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 28) రాణించాడు. దిగ్వేష్, షాబాజ్ చెరో 2 వికెట్లు తీశారు. ఓవర్టన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ ఓటమితో లఖ్‌నవూ ప్లేఆఫ్స్ ఆశలు ఆవిరయ్యాయి. 11 మ్యాచుల్లో 3 విజయాలు, 8 ఓటములు నమోదు చేసిన పంత్ సేన కేవలం 6 పాయింట్లతో ఆఖరి స్థానంలో నిలిచింది. ఛేదనలో చెన్నై ఓపెనర్లు సంజూ శాంసన్, రుతురాజ్ తొలి వికెట్‌కు 45 పరుగులతో చక్కని ఆరంభాన్నిచ్చారు. నాలుగో ఓవర్‌లో సంజూను దిగ్వేష్ అవుట్ చేయడంతో క్రీజులోకి వచ్చిన ఉర్విల్ పటేల్.. లఖ్‌నవూ బౌలర్లను ఊచకోత కోశాడు. ఐదో ఓవర్‌లో అవేశ్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ సిక్స్‌లు బాదిన పటేల్.. తర్వాతి ఓవర్‌లో మరో 3 సిక్స్‌లు, ఫోర్ సాధించాడు. ఆ వెంటనే మరో సిక్స్ కొట్టిన ఉర్విల్.. 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. 62 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉర్విల్ ఇచ్చిన క్యాచ్‌ను దిగ్వేశ్ మిస్ చేశాడు. ఆ వెంటనే పదో ఓవర్లో షాబాజ్ బౌలింగ్‌లో అవేశ్‌కు ఉర్విల్ చిక్కాడు. దీంతో రెండో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, ఫిఫ్టీ దిశగా సాగుతున్న రుతురాజ్‌ను 13వ ఓవర్లో షాబాజ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. బ్రేవిస్ (10), కార్తీక్ (20) కూడా స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. చివరి 3 ఓవర్లలో 30 రన్స్ కావాల్సి ఉండడంతో.. చెన్నై సులువుగానే గెలుస్తుందనుకున్నా శివం దూబే (15 నాటౌట్), ప్రశాంత్ వీర్ (17 నాటౌట్) పరుగులు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. అయితే, చివరి ఓవర్‌లో గెలుపునకు 10 రన్స్ అవసరమవగా.. దూబే రెండు సిక్స్‌లతో మ్యాచ్‌ను ముగించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్లు ఇన్‌గ్లిస్, మార్ష్ (10) తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ట పునాది వేశారు. ముఖ్యంగా ఇన్‌గ్లి?స ఎడాపెడా షాట్లతో విరుచుకుపడడంతో పవర్‌ప్లేను లఖ్‌నవూ 92/1తో ముగించింది. ఫామ్‌లో లేని పూరన్ (1)ను నూర్ వెనక్కి పంపగా, 10వ ఓవర్‌లో ఇన్‌గ్లిస్, పంత్‌లను ఓవర్టన్ అవుట్ చేశాడు. మార్‌క్రమ్ (6), అక్షత్ రఘువంశీ (18) కూడా విఫలం కావడంతో.. లఖ్‌నవూ 147/6తో ఇబ్బందుల్లో పడింది. కానీ, డెత్ ఓవర్లలో షాబాజ్, హిమ్మత్ (17) ఏడో వికెట్‌కు 50 రన్స్ జోడించడంతో.. లఖ్‌నవూ 200 మార్క్‌ను అందుకోగలిగింది.




## సూపర్ డూపర్ హిట్ ఫిల్మ్ 'సిలంది' సీక్వెల్‌లో మాళవికకు ఛాన్స్!



2008లో వచ్చిన సూపర్ డూపర్ హిట్ మూవీ 'సిలంది'కి రెండో భాగం తెరకెక్కనుంది. మలయాళ నటి మాళవిక మేనన్ ప్రధాన పాత్రను పోషించనున్నారు. ఆదిరాజన్ ఈ చిత్ర దర్శకుడు. దీనిపై దర్శకుడు మాట్లాడుతూ, 'సిలంది-2' నేను దర్శకత్వం వహించే ఐదో చిత్రం. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం, బెంగాలీ వంటి భాషల్లో రూపొందిస్తాం. కాంబోడియా, వియత్నాం వంటి దేశాల్లో షూటింగ్ జరుపుతాం. 'లోకా', 'కాంతార' తరహాలో గ్రాఫిక్స్ హైలెట్స్‌గా ఈ చిత్రం ఉంటుంది. 2008లో వచ్చిన తొలిభాగంలో మున్నా, మోనిక, రియాజ్ ఖాన్ ప్రధాన పాత్రలను పోషించారు. తొలిభాగం తరహాలోనే రెండో భాగాన్నికూడా హారర్ మూవీగా రూపొందించేలా కథను సిద్ధం చేశాం. ఈ సీక్వెల్ కూడా బ్లాక్ బస్టర్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. 'సిలంది' (2008) విషయానికి వస్తే.. ఇది 2008లో వచ్చిన ఒక ఎరోటిక్ థ్రిల్లర్ సినిమా. నటి మోనిక గ్లామరస్ రోల్‌లో కనిపించి అప్పట్లో సంచలనం సృష్టించారు. కథ విషయానికి వస్తే.. ఒక కొత్త జంట హనీమూన్ కోసం ఒక రిమోట్ విల్లాకు వెళ్తారు. అక్కడ వారికి ఎదురైన వింత అనుభవాలు, మోనిక గతం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇది హాలీవుడ్ మూవీ ప్రేరణతో తీశారని అప్పట్లో టాక్ ఉండేది. ఈ సినిమాను తెలుగులో 'ఎర్ర గులాబీ' పేరుతో డబ్ చేసి విడుదల చేశారు.

## నా సినిమాల్లో కథే హీరో: సమంత



ప్రముఖ నటి సమంత తన కెరీర్ పంథాపై స్పష్టమైన ప్రకటన చేశారు. ఇకపై తాను నటించే చిత్రాల్లో కథే ప్రధాన హీరో అని, కంటెంట్‌కే తన మొదటి ప్రాధాన్యత ఉంటుందని తేల్చిచెప్పారు. ఇటీవల ఓ ప్రముఖ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన రాబోయే ప్రాజెక్టులలో హీరో ఎవరని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, "ఇకపై నేను అలాంటి సినిమాలు చేయడం లేదు" అని సమాధానమిచ్చారు.

ఈ సందర్భంగా తన ఫిలిం ఫిలాసఫీని వివరిస్తూ, "నేను చేసే సినిమాల్లో కథే హీరో అవుతుంది. కథ అనేది నిర్మాత, నటీనటుల కంటే గొప్పది" అని సమంత స్పష్టం చేశారు. మహిళా ప్రేక్షకులు తాము చూసే పాత్రలతో మమేకమయ్యేలా, తమను తాము ఆ పాత్రల్లో చూసుకునేలా ఉండే చిత్రాలు చేయడమే తన లక్ష్యమని ఆమె వివరించారు.

ఇదే ఆలోచనతో ఆమె 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ బ్యానర్‌పై నందినీ రెడ్డి దర్శకత్వంలో ఆమె నిర్మిస్తున్న తొలి చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 22న థియేటర్లలోకి 'పురుష'



బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తోన్న చిత్రం 'పురుష:'. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయమవుతున్నారు. వీరు వులవల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. మే 22న రిలీజ్‌కు సిద్ధమైన ఈ చిత్ర వివరాలను తెలిపేందుకు మేకర్స్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. 'పురుష:' కోసం సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. నేను ఇలా ఈ స్టేజ్ మీద నిల్చున్నానంటే దానికి మా నాన్నే కారణం. నన్ను నమ్మి ఈ పాత్రను ఇచ్చిన వీరు అన్నకి థ్యాంక్స్. నాకు యాక్టింగ్‌లో సపోర్ట్ చేసిన సప్తగిరి అన్నకి, కసిరెడ్డి అన్నకి థ్యాంక్స్. సక్సెస్ ఫుల్‌గా ఈ మూవీని పూర్తి చేశాం. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సమ్మర్‌లో 'పురుష:' మే 22న విడుదల కాబోతోంది. నిర్మాతగా మా నాన్న అనుకున్న స్థాయిలోనే సినిమాని తీశామని, నేను నటించానని అనుకుంటున్నాను. అందరూ మా సినిమాను చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నానని అన్నారు. దర్శకుడు వీరు వులవల మాట్లాడుతూ.. "పురుష:' విషయంలో నాకు సపోర్ట్ చేసిన నిర్మాత కోటేశ్వరరావు, కెమెరామెన్ సతీష్, హీరో పవన్ కళ్యాణ్‌లకు థ్యాంక్స్. ఈ సినిమాలో నటించిన సప్తగిరి, కసిరెడ్డి, మా హీరోయిన్లకు థ్యాంక్స్. మే 22న రిలీజ్ అవుతున్న ఈ సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నానని తెలిపారు.

సప్తగిరి మాట్లాడుతూ.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమాని అయిన బత్తుల కోటేశ్వరరావు.. తన కుమారుడిని హీరోగా పరిచయం చేస్తూ ఈ 'పురుష:' సినిమాను నిర్మించారు. మా డైరెక్టర్ వీరూ మా నుంచి మంచి నటనను రాబట్టుకున్నాడు. సినిమా ఎలా ఉంది.. స్క్రీన్ ప్లే ఎలా ఉంది అనేది తెలియాలంటే మే 22 వరకు వేయిట్ చేద్దాం. తప్పకుండా ఆయన తన మార్కు చూపించే ప్రయత్నం చేశాడు. హీరోగా ఎంట్రీ ఇస్తున్న పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు. మా ముగ్గురు హీరోయిన్‌లు, కసిరెడ్డి తమ్ముడు అందరూ బాగా నటించారు. మా దర్శకుడు వీరూ పేరు ఈ ఒక్క సినిమాతో కాకుండా ఒక పది సంవత్సరాలు వినపడేలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. హీరోకు మరిన్ని మంచి అవకాశాలు రావాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కసిరెడ్డి రాజ్ కుమార్, హాసిని సుధీర్, రాయంచ, విషిక తదితరులు మాట్లాడుతూ.. సినిమాను సక్సెస్ చేయాలని ప్రేక్షకులను కోరారు






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**